క్లుప్తంగా

మేహాద్రిగెడ్డ గేటు ఎత్తివేత



రిజర్వాయర్ నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

పెందుర్తి: మేహాద్రి గెడ్డ రిజర్వాయర్ గేటును అధికారులు గురువారం ఎత్తారు. రిజర్వాయర్ నీటి మట్టం ఉదయానికి 59.8/61 అడుగులకు చేరుకోవడంతో గేటును తెరిచేందుకు అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు రెండో గేటును కొన్ని అంగుళాల మేర ఎత్తి 175 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గురువారం రాత్రికి మేహాద్రి నీటిమట్టం 59.8 అడుగులు ఉన్నట్లు నీటిపారుదల శాఖ డీఈ స్వామినాయుడు తెలిపారు. ఏఈ ఆర్.విజయ్‌కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సుబ్బరాజు పర్యవేక్షించారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ



గ్రంథాలయాధికారికి పుస్తకాలు అందిస్తున్న దాతలు కృష్ణప్రియ, శ్రీనివాసరావు, యశ్వంత్

పెందుర్తి: పాఠకులకు అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉండాలన్న సంకల్పంతో గ్రంథాలయానికి పుస్తకాలు అందించి ఓ కుటుంబం పెద్దమనసు చాటుకుంది. సుజాతనగర్‌కు చెందిన బలివాడ కృష్ణప్రియ, శ్రీనివాసరావు, యశ్వంత్ స్థానిక శాఖా గ్రంథాలయానికి భారీ స్థాయిలో పుస్తకాలు సమకూర్చారు. వివిధ విభాగాలకు చెందిన నవలలు, సాహిత్యం, పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను గురువారం జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బి.సూర్యకళకు అందించారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు, పాఠకులు పాల్గొన్నారు.

సంరక్షణ గృహానికి బాలుడు



వంతల లోకేష్

పీఎం పాలెం: తల్లిదండ్రులను కోల్పోయి, రోడ్డుపై సంచరిస్తున్న బాలుడిని పోలీసులు చేరదీసి, సంరక్షణ గృహానికి అప్పగించారు. పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలు.. ఓ బాలుడు (11) ఎండాడ కూడలి ప్రాంతంలో కొద్ది రోజులుగా తిరుగుతుండటం గుర్తించిన స్థానికులు పీఎం పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. పోలీసులు బాలుడిని విచారించగా తన పేరు వంతల లోకేష్ అని, తల్లిదండ్రులు రంజిత్, సుభాషిత తన చిన్నప్పుడే మరణించారని తెలిపాడు. సింహాచలం, ఆరిలోవ ప్రాంతాల్లో తన బంధువులున్నారని, వారికోసం వెదుకుతున్నానని చెప్పాడు. అంతకు మించి వివరాలు చెప్పలేకపోయాడు. దీంతో ఆ బాలుని బాలుర సంరక్షణ గృహానికి అప్పగించారు. బాలుడి గురించి తెలిసినవారు పీఎం పాలెం పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ కోరారు.

ముత్యాలమ్మపాలెం రోడ్డులో జంగిల్ క్లియరెన్స్



తుప్పల్ని పొక్లెయిన్ సాయంతో తొలగిస్తున్న త్రినాథ్, మాజీ ఎంపీటీసీ శ్రీరామ్మూర్తి

పరవాడ: వాడచీపురుపల్లి–ముత్యాలమ్మపాలెం రహదారిలో జంగిల్ క్లియరెన్స్‌కు నాయుడుపాలెం పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. నాయుడుపాలెం కూడలి నుంచి ముత్యాలమ్మపాలెం వరకు రహదారికి ఇరువైపులా దట్టంగా పెరిగిన తుప్పలు, పిచ్చిమొక్కల కారణంగా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకుని గురువారం యంత్రాల సాయంతో తుప్పల్ని తొలగించినట్లు పంచాయతీ కార్యదర్శి త్రినాథ్ తెలిపారు. తుప్పల తొలగింపు కార్యక్రమంలో నాయుడుపాలెం మాజీ ఎంపీటీసీ కూండ్రపు శ్రీరామ్మూర్తి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెందుర్తి: పురుషోత్తపురం సబ్ స్టేషన్ ఎల్‌బీ నగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, జంగిల్ క్లియరెన్స్ పనుల నిమిత్తం పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ జోన్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పురుషోత్తపురం, పురుషోత్తపురం కాలనీ, గోకుల్‌ధాంకాలనీ, ఎస్‌ఏడీ కాలనీ, ఎల్‌బీ నగర్, శానాతివానిపాలెం ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

దీపాలంకరణ సేవకు సహస్ర అడ్డంకులు

సింహగిరి పైనున్న శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో సహస్ర దీపాలంకరణ సేవ పునరుద్ధరణ కోసం భక్తుల నిరీక్షణ కొనసాగుతోంది. ఈ ఆర్జిత సేవని పునరుద్ధరిస్తే తమ మొక్కులు చెల్లించుకునే వెసులుబాటు కలుగుతుందని భావిస్తున్నారు. కోవిడ్ సమయంలో నిలిచిన ఆర్జిత సేవల్లో సహస్ర దీపాలంకరణ సేవ మినహా మిగిలిన అన్ని సేవలనూ పునరుద్ధరించారు. దీన్ని మాత్రం ప్రత్యేక మండం నిర్మాణం పేరిట తాత్సారం చేస్తున్నారు.



ఆస్థాన మండపంలో సహస్ర దీపాలంకరణ సేవలో పాల్గొని దీపాలు వెలిగిస్తున్న భక్తులు(ఫైల్)

- కోవిడ్ కారణంగా నిలిచిపోయిన ఆర్జిత సేవ
- మిగిలిన సేవలన్నీ పునరుద్ధరణ
- దీపాలంకరణ సేవపై మీనమేషాలు
- కొత్త మండపం నిర్మాణం పేరిట తాత్సారం

సింహాచలం: కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమలేశుడి సన్నిధిలో మాదిరే ఉత్తరాంధ్రులు ఆరాధ్య దైవం సింహాచలేశుని సన్నిధిలో సహస్ర దీపాలంకరణ సేవను ప్రారంభించాలని పదేళ్ల కిందట సంకల్పించారు. అప్పటి దేవస్థానం ఈవో కె.రామచంద్రమోహన్ చొరవతో 2014 డిసెంబర్ 6న సహస్ర దీపాలంకరణ సేవ ప్రారంభమైంది. వైదికుల సమక్షంలో భక్తులు ఈ సేవలో పాల్గొన్నారు. ఆలయ ఆస్థాన మండపంలో గొలుసులుగా దీపాలను వ్రేలాడదీసి భక్తులు వాటిని వెలిగించే విధంగా ఏర్పాటు చేశారు. 2020లో కోవిడ్ మహమ్మారి విజృంభణతో ఆర్జిత సేవలు నిలిపేశారు. దీంతో సహస్ర దీపాలంకరణ సేవకూ బ్రేక్ పడింది.

భక్తుల నుంచి విశేష ఆదరణ

ఆలయ ఆవరణలో ప్రతి శనివారం సాయంత్రం 5 గంటలకు జరిగే ఈ సేవలో పాల్గొనేందుకు అధిక సంఖ్యలో భక్తులు ఆసక్తి చూపేవారు. ఇందుకు ఒక్కో భక్తునికి రూ.250 చొప్పున టికెట్ కూడా పెట్టారు. ప్రతి వారం పదుల సంఖ్యలో ఈ సేవలో పాల్గొనేందుకు భక్తులు వచ్చేశారు. సాయంత్రం నిర్వహించే సేవ కావడంతో సింహాచలం పరిసర గ్రామాల భక్తులే ఎక్కువగా ఈ సేవలో పాల్గొని తరించేవారు. 2020లో వచ్చిన కోవిడ్ కారణంగా ఆలయంలో జరిగే ఆర్జిత సేవలన్నీ నిలిపివేశారు. ఆ తర్వాత అంచెలంచెలుగా ఆర్జిత సేవలను పునరుద్ధరిస్తూ వచ్చారు. కోవిడ్‌కి ముందు ప్రతీరోజూ సాయంత్రం మూలవిరాట్‌కి జరిగే సహస్రనామార్చనని కూడా మూడు మాసాల క్రిందట మళ్లీ ప్రారంభించారు. సహస్ర దీపాలంకరణ సేవ మాత్రం ఇప్పటికీ పునరుద్ధరణకు నోచుకోలేదు.

స్పష్టత రావాలట!

సహస్ర దీపాలంకరణ సేవ పునరుద్ధరణలో జాప్యానికి దేవస్థానం అధికార, వైదికుల నిర్లక్ష్యమే కారణమని స్థానిక భక్తులు ఆరోపిస్తున్నారు. ఈ సేవ పునరుద్ధరణకు కొత్త మండపం నిర్మిస్తున్నట్లు చెప్పి, కాలక్షేపం చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొత్త మండపం నిర్మాణానికి విశాఖకు చెందిన నారాయణరెడ్డి అనే దాత ముందుకొచ్చారు. గత నెల్లో ఇందుకు శంకుస్థాపన కూడా చేశారు. అయినా పనులు ప్రారంభానికి నోచుకోలేదు. సింహగిరి మాస్టర్‌ప్లాన్, ప్రసాద్ స్కీం నిర్మాణాలపై స్పష్టత వచ్చాకే ఈ మండం నిర్మాణంపైనా ఓ స్పష్టత వస్తుందని చెప్తున్నారు. కనీసం అప్పటి వరకు పాత పద్ధతిలో ఆస్థాన మండపంలోనైనా ఈ ఆర్జిత సేవను కొనసాగిస్తే బాగుంటుందని భక్తులు కోరుతున్నారు.

పునరుద్ధరించిన ఆర్జిత సేవలు

కోవిడ్ సమయంలో నిలిపేసిన నిత్యకల్యాణం, గరుడసేవ, సహస్ర నామార్చన(కల్యాణమండపంలో), ప్రతి గురు, ఆదివారాల్లో జరిగే స్వర్ణపుష్పార్చన, ఏకాదశి రోజున జరిగే స్వర్ణ తులసీ దళార్చన, స్వాతి నక్షత్రం రోజు నిర్వహించే శ్రీ నృసింహ హోమం, అమ్మవారికి కుంకుమ పూజలను ఎప్పుడో పునరుద్ధరించారు. గత మూడు మాసాల నుంచి అంతరాలయంలో స్వామివారి మూలవిరాట్‌కు రోజూ సాయంత్రం జరిగే సహస్రనామార్చననూ ప్రారంభించారు. పునరుద్ధరణకు నోచుకోని ఏకైక ఆర్జిత సేవ సహస్ర దీపాలంకరణ సేవే..!

త్వరలో కొత్త మండపం నిర్మాణం



సహస్రదీపాలంకరణ సేవ కోసం సింహగిరిపై కొత్తగా మండపం నిర్మించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాం. మండపం నిర్మాణానికి ఒక దాత కూడా ముందుకు వచ్చారు. ఇటీవలే ఆ పనులకు శంకుస్థాపన జరిగింది. త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయి. సింహగిరి మాస్టర్ ప్లాన్‌తో అనుసంధానం చేసుకుంటూ ఈ నిర్మాణం చేపట్టాల్సి ఉంటుంది. నిర్మాణం పూర్తి కాగానే అందులో సహస్ర దీపాలంకరణ సేవ పునరుద్ధరించబడుతుంది.

– శ్రీనివాసరాజు, ఈఈ, సింహాచలం దేవస్థానం

గ్రామాల్లో పూర్తిస్థాయి మౌలిక వసతులు



పెదగాడిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

పెందుర్తి: నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలోనూ పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. 'పల్లె–పండగ' కార్యక్రమంలో భాగంగా మండలంలోని సరిపల్లి, పెదగాడి, రాజయ్యపేట, చింతలఅగ్రహారం, జంగాలపాలెంలో గురువారం ఎమ్మెల్యే పర్యటించారు. ఆయా పంచాయతీల పరిధిలో ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో శంకుస్థాపనలు చేసిన అభివృద్ధి పనుల్ని అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రజలు ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమాల్లో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

'తానాంలో ప్రభుత్వ భూముల్ని కాపాడాలి'

పరవాడ: మండలంలోని తానాం గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూములను పరిరక్షించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని గొర్లివానిపాలెం గ్రామానికి చెందిన చిప్పాడ రామారావు అధికారులను కోరారు. తానాం గ్రామంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో అధికారులకు ఈ మేరకు ఆయన వినతి పత్రం అందించారు. తానాం గ్రామంలో నీటి ప్రవాహ భూములు, కొండలు, గుంటలు, వాగులు, పంట కాలువలు, శ్మశానవాటిక స్థలాలను పరిరక్షించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు.

విద్యార్థులకు సమాజంపై అవగాహన తప్పనిసరి

- జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ వెంకటశేషమ్మ



టీచర్లకు, ఎండీఎం నిర్వాహకులకు సూచనలిస్తున్న జస్టిస్ వెంకట శేషమ్మ

సింహాచలం: అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్‌ని జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ జస్టిస్ ఎం.వెంకటశేషమ్మ గురువారం సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. నాణ్యత, రుచి గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆహార పదార్థాలు తయారు చేసేటప్పుడు పాటించాల్సిన శుభ్రతపై నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. పదార్థాలు ఎలా తయారు చేయాలో వీడియోల ద్వారా చూపించారు. మధ్యాహ్న భోజనం పథకానికి సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో సమావేశమై పోక్సో చట్టం గురించి అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను వివరించారు. గుడ్‌టచ్–బ్యాడ్ టచ్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ అంశాలతోపాటు సమాజం పట్ల విద్యార్థులకు కనీస అవగాహన ఉండేలా ప్రతి వారం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులను సూచించారు. మత్తు పదార్థాలు, గంజాయి సేవించడం వల్ల కలిగే అనర్థాలను తెలిపారు. చట్టరీత్యా అది నేరమని, వాటికి దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇమంది పైడిరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనుమతి లేని బాణసంచా సీజ్

పెందుర్తి: లైసెన్స్ లేకుండా తరలిస్తున్న బాణసంచా సామగ్రిని పెందుర్తి పోలీసులు గురువారం పట్టుకున్నారు. సీఐ సతీష్‌కుమార్ తెలిపిన వివరాలు. పెందుర్తికి చెందిన ముగ్గురు యువకులు రూ.50 వేలు విలువైన బాణసంచాను విజయనగరంలో కొనుగోలు చేసి పెందుర్తికి తరలిస్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు సరిపల్లి వద్ద కాపు కాసి వాహనాన్ని, అందులోని బాణసంచాను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

సదా వందనీయుడు వాల్మీకి



ఇస్సన్నపేటలో వాల్మీకి జయంతి వేడుకలు



వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రధానోపాధ్యాయుడు సన్యాసిరావు, విద్యార్థులు

పరవాడ: వాడచీపురుపల్లి శివారు ఇస్సన్నపేట ఆంజనేయస్వామి దేవాలయంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు కూండ్రపు కృష్ణంనాయుడు, బీసీ మహిళా అధ్యక్షురాలు కూండ్రపు ఉమామహేశ్వరి వాల్మీకి మహర్షి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. పండ్లు, మిఠాయిలు, ఆంజనేయస్వామి కండువాలను పంపిణీ చేశారు. మాసవరపు అప్పారావు, ఎం.వెంకునాయుడు, గెడ్డం అయ్యప్ప, జి.బాబూరావు పాల్గొన్నారు.

- సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాయుడుపాలెంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా జరిపారు. వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రామాయణం రచించి, ఉత్తమ జీవన విధానాలను అందించిన మహానుభావుడు వాల్మీకి మహర్షి సదా వందనీయుడని మండల ధర్మ ప్రచారక్ వెన్నల అప్పలనాయుడు కొనియాడారు. పైల తాతబాబు, చుక్క నాయుడు, దుంగల అక్కునాయుడు, బుజ్జి నారాయణరావు, రాజేష్ పాల్గొన్నారు.

సింహాచలం: వాల్మీకి మహర్షి జయంతిని 98వ వార్డు పరిధి సింహాచల్‌నగర్ ఎంపీపీ స్కూల్లో ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం గేదెల సన్యాసిరావు వాల్మీకి చిత్రపటానికి పూలమాలవేసి పూజలు చేశారు. ఆదికవి వాల్మీకి తపశ్శాలి, గొప్ప మహర్షి అని కొనియాడారు. వాల్మీకి విరచిత రామాయణం భారతీయ విలువలకు మూలమన్నారు. 2,400 శ్లోకాలతో రామాయణం సీతారాముల పవిత్ర చరిత్రను ప్రపంచానికి అందించిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులంతా పూలు, పండ్లతో వాల్మీకి మహర్షిని కొలిచారు. కార్యక్రమంలో ఉపాధ్యాయిని ఎం.ఝాన్సీలక్ష్మీబాయ్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో



రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ ఎంఎస్‌వీకే బాలాజీ

సబ్బవరం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎంఎస్‌వీకే బాలాజీ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీ రికార్డులను పరిశీలించారు. పలు ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన రికార్డుల గురించి ఆరా తీశారు. ఎంఎల్‌హెచ్‌పీలపై వచ్చిన అభియోగాలపై విచారణ జరిపారు. విచారణలో భాగంగా వారి హాజరు పట్టికలు, ఎఫ్‌ఆర్‌ఎస్ రికార్డులను కూలంకషంగా తనిఖీ చేశారు. గొటివాడలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌ను సందర్శించారు. రోగులతో మాట్లాడారు. అక్కడి రికార్డుల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. సబ్బవరం పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఎస్ఎన్ చక్రవర్తితో పాటు వైద్య సిబ్బంది ఉన్నారు.

ఆగని చినుకులు.. అధ్వానంగా రోడ్లు



అక్కిరెడ్డిపాలెం–సింహాచలం ప్రధాన రహదారిలో దువ్వపాలెం వద్ద చెరువును తలపిస్తున్న రోడ్డు



పినగాడి–వేపగుంట రోడ్డులో కూడలి వద్ద అధ్వానంగా మారిన రహదారి



ఎన్టీపీసీ వద్ద రోడ్డు మీదుగా ప్రవహిస్తున్న వర్షపునీరు



పరవాడ పైడిమాంబ టెంపుల్ ఎదురుగా అధ్వానంగా మారిన రహదారి



గోతులతో నిండిన వెన్నలపాలెం రోడ్డు

పెందుర్తి: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లు అధ్వానంగా మారాయి. పినగాడి–వేపగుంట రోడ్డులో పినగాడి కూడలి వద్ద రహదారి పూర్తిగా చిత్తడిగా మారింది. ఇక్కడి పెట్రోల్ బంక్ సమీపంలో రోడ్డు దాదాపుగా శిథిలమైంది. గురువారం కురిసిన వర్షంతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మరోవైపు అక్కిరెడ్డిపాలెం–సింహాచలం ప్రధాన రహదారి దువ్వపాలెం వద్ద రోడ్డు చెరువును తలపించింది. ఈ మార్గంలో వాహనదారులు భయం భయంగా ప్రయాణం సాగించారు.

పరవాడ: వర్షాకాలం వచ్చిందంటే చాలు మండలంలో పలు గ్రామాల రహదారులు అధ్వాన్నంగా మారుతున్నాయి. మండలంలో పరవాడ పైడిమాంబ ఆలయం ఎదురుగా ఉన్న రహదారితో పాటు ఎన్టీపీసీ–వెన్నలపాలెం గ్రామాల మధ్య రహదారి, వాడచీపురుపల్లి–ఎన్టీపీసీ మధ్య రహదారిని ఉదాహరణగా చెప్పవచ్చు.

- పైడిమాంబ ఆలయం ఎదురుగా ఉన్న రోడ్డు అధ్వానంగా మారిన నేపథ్యంలో చిన్నపాటి వర్షం కురిసినా ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఇక్కడి రోడ్డు భారీ గోతులతో నిండి, భారీ వాహనాలు ఆ గోతుల్లో పడి నిలిచిపోతున్నాయి. ఫలితంగా వెనుక వచ్చిన వాహనాలు వెళ్లే అవకాశం లేక గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అవుతోంది.
- ఎన్టీపీసీ–వెన్నలపాలెం రహదారిలో పలు చోట్ల ఏర్పడిన గోతులతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. వర్షాకాలంలో గోతుల్లో నీరు చేరినప్పుడు గోతులను గుర్తించకుండా ప్రయాణించడం వల్ల ప్రమాదాలకు గురవుతున్నామని వాహనచోదకులు అంటున్నారు. రాత్రి సమయంలో గోతుల వలన మరిన్ని ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- వాడచీపురుపల్లి–పరవాడ రహదారిలో ఎన్టీపీసీ నాలుగో యూనిట్ వద్ద రోడ్డు మీదుగా జోరుగా ప్రవహిస్తున్న వర్షపు నీరు కారణంగా రోడ్డు శిథిలావస్థకు చేరింది. రహదారిలో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రోడ్లను కనీసం పట్టించుకోవట్లేదని ప్రజలు ఆక్షేపిస్తున్నారు. తాత్కాలి చర్యల్లో భాగంగానైనా గోతుల్ని పూడ్చాలని కోరుతున్నారు.

ప్రభుత్వ పథకాల్ని సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

పెందుర్తి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా స్థిరపడాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు అన్నారు. స్థానిక తాండ్ర పాపారాయుడు ఫంక్షన్ హాల్‌లో గురువారం ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం రానున్న రోజుల్లో ప్రజలకు మరింత మేలు చేసేందుకు కృషి చేస్తుందన్నారు. పలు అంశాలపై లబ్ధిదారులకు అవగాహన కలిగించారు. లబ్ధిదారులకు ధ్రువపత్రాలు, ఐడీ కార్డులు అందించారు. జెడీ్స హైమావతి, వెలుగు, డీఆర్‌డీఏ, యూసీడీ, జీవీఎంసీ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన

సబ్బవరం: ప్రజాస్వామ్య స్ఫూర్తిని కొనసాగించడంతోపాటు, రాజ్యాంగ విలువలను కాపాడేందుకు యువత తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని తహసీల్దార్ బి.చిన్నికృష్ణ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటరు నమోదుపై గురువారం అవగాహన కల్పించారు. 18 ఏళ్లు నిండిన యువత తప్పనిసరిగా ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సూచించారు. డిగ్రీ కళాశాలలో 18 ఏళ్లు నిండిన విద్యార్థులకు ఫారం–6ను అందించారు. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానంలో కూడా ఓటర్లుగా నమోదు కావచ్చని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ అవగాహన కార్యక్రమంలో ఎంపీడీవో పద్మజ, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ బి.శంకర్, అర్జునరావుతో పాటు కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమూల్ డెయిరీ దసరా కానుకల పంపిణీ

పరవాడ: అమూల్ మిల్క్ డెయిరీ అసోసియేషన్ అందిస్తున్న రాయితీలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలపాక సర్పంచ్ బొండా కనకారావు సూచించారు. అమూల్ డెయిరీ ఆధ్వర్యంలో కలపాకలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంస్థ దసరా కానుకగా అందించిన స్టీల్ పాల క్యాన్లు, దుప్పట్లను పాడిరైతులకు పంపిణీ చేశారు. డెయిరీ ద్వారా సేకరించిన శాంపిల్ పాలను విక్రయించగా వచ్చిన నగదుతో ఈ కానుకల్ని అందిస్తున్నట్లు తెలిపారు కార్యక్రమంలో అమూల్ మిల్క్ డెయిరీ కార్యదర్శి నగిరెడ్డి యశోద, అల్లం రామకృష్ణ, గంగిరెడ్ల మోహన్, నగిరెడ్డి శ్రీనాథ్, అల్లం లక్ష్మి, హేమలత, ఇందల లక్ష్మి, నగిరెడ్డి సన్యాసమ్మ పాల్గొన్నారు.

ప్రైవేట్ కంపెనీల్లో ఉపాధి కల్పన

పెందుర్తి: మండలంలోని గుర్రంపాలెం ఏపీఐఐసీ స్థలాల్లో ఏర్పాటైన జొమాటో, రిలయన్స్ సంస్థల్లో స్థానిక యువతకు ఉపాధి కల్పించారు. ఈ మేరకు గురువారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు చేతుల మీదుగా గుర్రపాలెం, ముదపాక పంచాయతీలకు చెందిన సుమారు 30 మంది యువకులకు నియామక పత్రాలు అందించారు. కార్యక్రమంలో స్థానిక నాయకుడు సుఖవాసి అజయ్, ఆయా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

గౌరమ్మకు ప్రత్యేక పూజలు



గౌరమ్మకు పూజలు చేస్తున్న గండి రవికుమార్

సబ్బవరం: మండలంలోని మొగలిపురంలో కర్రి వారి కొంపల వద్ద గురువారం నిలుపుదల చేసిన గౌరమ్మను వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్ దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట ఉప సర్పంచ్ సిరపరపు వాసు, ఐడీ బాబు, ఎమ్మెల్యే దేముడు, వార్డు మెంబర్లు గోతిరెడ్డి కనకరాజు, బైలపూడి బంగారయ్య, అప్పికొండ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యూబీఏ సహకారంతో గ్రామాభివృద్ధి



విద్యార్థులతో యూబీఏ ప్రతినిధి డాక్టర్ పావని

పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో ఉన్నత భారత్ అభియాన్(యూబీఏ) ఆడిట్‌ను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్ర యూనివర్సిటీ యూబీఏ రీజనల్ కో ఆర్డినేటర్ డాక్టర్ బి.పావని మాట్లాడుతూ యూబీఏ ద్వారా 5 గ్రామాలను దత్తత తీసుకున్నామని, వాటిని ఆదర్శ్ డిగ్రీ కళాశాల సారథ్యంలో అభివృద్ధి చేస్తామని తెలిపారు. కళాశాల కార్యదర్శి టి.థియోఫిలాస్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా కామేశ్వరుడు, కామేశ్వరీదేవిల కల్యాణం



సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి ఆలయంలో సిరిజ్యోతి పూజ, జలహారతిలో భక్తులు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి ఆరాధనా పీఠంలో దసరా బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా కామేశ్వరుడు, కామేశ్వరీదేవిల కల్యాణ మహోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సహస్రాక్షి అమ్మవారికి పంచామృతాభిషేకాలు, 28 కలశాల పుణ్యజలాలతో పూర్ణకుంభాభిషేకం నిర్వహించారు. శ్రీమేరు మొదటి అంతస్తులోని జ్ఞానేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. దేశ, విదేశాల నుంచి వచ్చిన భక్తులు లలితా సహస్ర నామావళి హవనంలో పాల్గొన్నారు. సాయంత్రం నిర్వహించిన విశాఖకు చెందిన ఆర్ట్ ఆఫ్ లివింగ్ సభ్యుల భజనలు, భక్తి పాటలు ఆకట్టుకున్నాయి. చంద్రోదయ సమయాన శ్రీమేరునకు ఈశాన్య భాగంలో ఏర్పాటుచేసిన కొలనులో చంద్రుని ప్రతిబింబాన్ని చూస్తూ కర్పూర హారతులిచ్చి, సిరిజ్యోతి పూజ, జలహారతి నిర్వహించారు.